# శ్రీ కూరత్తాళ్వాన్



కూరము అనే గ్రామములో సంపన్న కుటుంబములో జన్మించి సామాజిక స్పృహతో గ్రామస్థులందరికి ఎన్నో సేవలు నొనరించినవారు కూరేశులు. గ్రామప్రజల బాగోగులు తెలుసుకోవడానికి, వారిని తగు సేవలందించడానికి గ్రామంలో తిరుగుతూ ఉండేవారు. ఒకనాడు ఒక ఇంటిలో తమ కుమార్తెకు వివాహం చేస్తే వైధవ్యం సంభవిస్తుందని దుఃఖిస్తున్న తల్లిదండ్రులను ఓదార్చి, వారిని ఒప్పించి ధైర్యంతో వారి కుమార్తె ఆండాళ్ ను వివాహమాడారు శ్రీ కూరేశులు. ఒకరికొకరు తోడునీడై జీవితం గడిపారు. కానీ ఏనాడు సంసారం చేయలేదు. ప్రతినిత్యం వచ్చిన వారందరికి అన్న సంతర్పణ చేసి చివరగా వారు భుజించే వారు. భగవదనుగ్రహం చేత పూర్ణజ్ఞానులై వయోవృద్ధులై ఉన్నా ఈ లోకములో ఉన్న మనకందరికీ మహాపురుషులు రామానుజులే అని తెలియ జేయడానికై తన సమస్త సంపదలను దాన ధర్మాలు చేసి కట్టుకున్న బట్టలతో భార్యాసమేతులై శ్రీ రామానుజులను ఆశ్రయించేరు శ్రీ కూరేశులు. దేహాభిమానం లేని వారై శ్రీ రంగ వీధులలొ భిక్షాటనం చేస్తూ భగవద్రామానుజుల శ్రీపాదసేవలో జీవితమును అంకితం చేసిన మహానుభావులు శ్రీ కూరేశులు. భగవద్రామానుజులకు కూడా వీరంటే చాల ఇష్టం, గౌరవం కూడ.

భగవద్రామానుజులు బ్రహ్మసూత్రములకు వ్యాఖ్యానం చేయ సంకల్పించారు. దానికై బోధాయన వృత్తి గ్రంథమును పరిశీలించుటకై కాశ్మీరులోని సరస్వతీ భాండాగారమునకు కూరేశులును తీసుకు వెళ్ళారు. అక్కడ బోధాయన గ్రంథమును తీసుకున్నారు. దానిని రాత్రంతా కూర్చుని పూర్తిగా చదివి అర్థం చేసుకున్నారు శ్రీ కూరేశులు. తిరిగి ఆ గ్రంథమును ఇచ్చి వేయవలసి వచ్చింది. గ్రంథము దగ్గర లేక పోవుట చేత మనసు కలత చెంది బాధపడు తున్న శ్రీ రామానుజుల వారితో శ్రీ కూరేశులు ఆ గ్రంథమునంతా నేను చదివానని, అంతా

గుర్తుందని తెలిపారు. ఆశ్చర్యపోయిన రామానుజులు వీరిని ఎంతగానో మెచ్చుకుని వీరి సహకారంతోనే బ్రహ్మసూత్రాలకు వ్యాఖ్యానం రచించారు. రామానుజుల వారు చెపుతుండగా కూరేశులు వ్రాసిన బ్రహ్మసూత్ర వ్యాఖ్యాన గ్రంధమే శ్రీ భాష్యం పేర ప్రకాశించింది.

శ్రీ రంగ ఆలయ నిర్వాహకులగా ఉండే తిరువరంగత్త ముదనార్ అనే శిష్యులను తీర్చిదిద్ది రామానుజుల శ్రీపాదములను ఆశ్రయింపచేసారు. తిరువరంగత్త ముదనార్ నుండి శ్రీ రంగ ఆలయ తాళాలు తీసుకుని ఆలయ నిర్వహణ బాగా జరిగేట్లు చేయమని రామానుజుల వారికి అప్పగించిన వారు శ్రీ కూరేశులు. శ్రీ రంగ ఆలయ వైభవానికి కూరేశుల సేవలు ఎంతో ఎన్నదగినవి. తిరువరంగత్త ముదనార్ ద్వారా ఇరామానుజ నూత్తందాది గ్రంథమును ప్రకాశింపచేసిన ఘనత శ్రీ కూరేశులదే.

వీరిని శ్రీ వత్సాంక మిశ్రులని, కూరత్తాళ్వాన్ అని కూడా పిలుస్తారు. వీరికి శ్రీరంగనాథుని అనుగ్రహ ప్రసాదం వలన పరాశర భట్టర్, వ్యాస భట్టర్ అనే ఇరువురు కుమారులు కలిగారు.

కులోత్తుంగుడు (క్రిమికంఠుడు) అనే చోళరాజు పాలించే రోజులవి. అతడు శైవమతస్థుడు. శైవమతాన్ని స్వీకరించమని హింసించే వాడు. నాలూరాన్ అనే పేరుగల మంత్రి, రాజుతో "వైష్ణవ మత ప్రచారకులైన భగవద్రామానుజులు శ్రీ రంగంలో ఉన్నారు. వారిచేత 'శివాత్ పరతరం నాస్తి' అనే సిద్ధాంతాన్ని అంగీకరింప జేస్తే అందరిచేత అంగీకరింప చేసునట్టే" అంటూ సలహా చెప్పాడు. క్రిమికంఠునికి ఆ సలహా నచ్చి వెంటనే రామానుజులను తీసుకొని రమ్మని భటులని పంపాడు. ఈ విషయం తెలిసిన శ్రీ కూరేశులు రామానుజులవారి కాషాయ వస్త్రాలు ధరించి త్రిదండాన్ని చేత బట్టి రామానుజుల గురువుగారైన పెరియనంబి గారితో కలసి ఆ భటుల వెంట రాజసభకు వెళ్ళి **శ్రీమన్నారాయణుడే పరతత్త్వము** అని సప్రమాణంగా నిరూపించారు. అయితే ఇది భరించలేక ఆవేశంతో రాజు వీరి కళ్ళు పీకి పారేయమని ఆజ్ఞాపించాడు. శ్రీ కూరేశులు

రాజుతో మహాపాపాత్ముడవైన నీ ముఖం చూసిన కళ్ళతో నా ఆచార్యుణ్ణి భగవంతుణ్ణి చూడాలని లేదు. నా కంటిని నేనే తొలగించు కుంటున్నాను అని తమ చేతి వేళ్ళతో కళ్ళని పొడుచుకొని, గుడ్లను తొలగించి రాజు ముందు విసిరేసిన ధీరులు.

వీరు చివరగా శరీర బాధను భరించ లేక భగవంతుణ్ణి ప్రార్థించి స్వామి అనుగ్రహించగా, మా ఆచార్యులైన రామానుజుల సంబంధం గలవారందరికి మోక్షమును ప్రసాదించమని కోరారు. ఆ విషయం తెలిసిన రామానుజులు వీరిని చూసి కూరేశా! ఎంత విశాల హృదయం మీది. మీకొక్కడికే కాక మీతోపాటు మా అందరికి మోక్షాన్ని ప్రసాదించమని కోరారా! భగవంతుణ్ణి అంటూ హర్షాతిరేకంతో తమపై ఉండే కండువాని పైకి విసిరి ఆనందపరవశంతో నాట్యం చేసారు. మీవంటి వారి వల్ల కదా మేం కూడా తరిస్తున్నాము అంటూ ఆచార్యులైన రామానుజులచే కొనియాడబడిన దివ్య చరిత్ర శ్రీకూరేసులది.

వీరు భగవంతుణ్ణి కీర్తిస్తూ ఐదు స్తవములను రచించారు. అవే 1) శ్రీస్తవం 2) సుందర బాహు స్తవం 3) శ్రీ వరదరాజ స్తవం 4) అతిమానుష స్తవం 5) శ్రీ వైకుంఠ స్తవం. దాన్ని అధ్యయనం చేద్దాం. వారి తిరునక్షత్రం సందర్భంగా ఈ క్రింది శ్లోకాలతో వారిని స్మరిద్దాం.

**తిరునక్షత్ర తనియన్:**

మకరే హస్త నక్షత్రే సర్వనేత్రాంశ సమ్భవమ్।
శ్రీమత్కూర కులాధీశం శ్రీవత్సాఙ్కముపాస్మహే॥

**నిత్య తనియన్:**

శ్రీవత్స చిహ్నమిశ్రేభ్యో నమ ఉక్తి మధీమహే।
యదుక్తయస్త్రయీ కంఠే యాన్తి మఙ్గళ సూత్రతామ్॥

జైశ్రీమన్నారాయణ!